Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం 24/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## 'ఇంటి ముంగిటకే మీ సేవ సర్వీసులు'



▶▶| ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

టీ మీడియా, సెప్టెంబర్ 24, హైద్రాబాద్ బ్యూరో: ఇంటి ముంగిటకే మీసేవ సర్వీసులు పేరిట డోర్ డెలివరీ సర్వీసెస్‌కు (మిగతా 2లో)

# జూరాల కాల్వలకు సాగునీరు విడుదల

## డీకే శివకుమార్‌కు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు



టీ మీడియా, సెప్టెంబర్ 23, బెంగుళూరు: తెలంగాణకు నీరు విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం తెలిపింది. విడతలవారీగా 3 టీఎంసీలను ఇవ్వడానికి హామీ ఇచ్చింది. కర్ణాటక సీఎం డీకే శివకుమార్?, ఇరిగేషన్ అధికారులతో పాలమూరు ప్రజాప్రతినిధుల భేటీలో నిర్ణయం తీసుకున్నారు.

ఎల్‌నినోతో ఏర్పడిన నీటిఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాటపట్టిన జూరాల ఆయకట్టు రైతులకు కర్ణాటక ప్రభుత్వం నుంచి శుభవార్త అందింది. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల చర్చలతో నీటివిడుదలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల విడుదల చేయాలని సీఎం డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. కర్ణాటక సర్కార్ సానుకూల స్పందనతో జూరాల కాల్వలకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు.

**3 టీఎంసీల విడుదలకు వెంటనే చర్యలు**

జూరాల ఆయకట్టు రైతులు, ఆందోళనలు, రాస్తారోకోలతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితానిచ్చాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కీలకమైన జూరాల జలాశయం కింద కృష్ణా జలాలను విడుదల చేయాలని రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తికి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో మరోసారి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడిపై వివరించి నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. మంత్రుల విజ్ఞప్తికి శివకుమార్ అంగీకరించారు. నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**డీకే శివకుమార్‌కు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు**

మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక సీఎంకు ఫోన్ చేసి జూరాల దిగువన ఉన్న అవసరాలను వివరించారు. నీటి నిల్వలు తగ్గిపోయిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్‌ల నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రం నుంచి మంత్రుల బృందాన్ని పంపుతున్నట్లు డీకేకు వివరించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా డీకేతో మాట్లాడారు. ఈ పరిణామాల నడుమ మంగళవారం బెంగళూరు వెళ్లిన మంత్రుల బృందం నీటివిడుదలపై కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మరోసారి భేటీ అవుదామని డీకే సూచనతో మళ్లీ జరిగిన సమావేశంలో (మిగతా 2లో)

# జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, అరెస్ట్ చేయండి





▶▶| సర్ వివాదంపై విపక్షాల డిమాండ్

టీ మీడియా, సెప్టెంబర్ 23, ఢిల్లీ బ్యూరో: : దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠను, విశ్వసనీయతను ఆయన పూర్తిగా దిగజార్చారని ఆరోపించాయి. ఆయన్ను తక్షణమే సీఈసీ పదవి నుంచి తొలగించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకున్నారంటూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఓ వార్తా సంస్థ కథనం ప్రచురించడంతో ప్రతిపక్షాలు, సీఈసీ లక్ష్యంగా వాగ్బాణాలు సంధించాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఈసీని అడ్డుపెట్టుకుని ఓటు చోరీ చేస్తూ ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరోపించాయి. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఎన్నికల సంఘం కుమ్మక్కై దేశద్రోహానికి పాల్పడ్డాయని విమర్శించాయి. ఈసీని ఏదో అదృశ్యశక్తి నడిపిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఏకాభిప్రాయం, మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండా తీసుకున్న నిర్ణయాలన్నీ చట్టవిరుద్ధంగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈసీ ఏకచ్ఛత్రాధిపత్యంగా మారిందని సీపీఎం దుయ్యబట్టింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా ఓటరు జాబితా నుంచి అనేక మంది ఓట్లను తొలగించారని ఆరోపించింది. వెంటనే పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి సీఈసీ అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది.

**జ్ఞానేశ్ కుమార్ కచ్చితంగా జైలుకు వెళ్తారు సంజయ్ రౌత్**

మరోవైపు శివసేన (యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే సైతం తమ రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ కచ్చితంగా జైలుకు వెళ్తారని శివసేన-యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సీఈసీని అభిశంసించాల్సిన సమయం ఆసన్నమైందని టీఎంసీ రాజ్యసభ పక్ష నేత డెరిక్ ఒబ్రెయిన్ అన్నారు. "జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచారని మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. దాని ద్వారానే మోదీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారు. ఈ దారుణాలకు పాల్పడినందుకు జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. ఆయన నేతృత్వంలో జరిగిన ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్, బంగాల్, హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి' అని ఆప్? కన్వీనర్? కేజ్రీవాల్ అన్నారు.

**రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్**

మరోవైపు ఇదే అంశంపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఈసీ అక్రమాలకు పాల్పడ్డాయని ఇప్పుడు రుజువైందన్నారు. పాత ఓటర్ల జాబితాతో (మిగతా 2లో)

# సీఎస్‌తో ఉద్యోగుల ఐకాస చర్చలు విఫలం



▶▶| మళ్లీ జేఏసీతో సమీక్షించిన డిప్యూటీ సీఎం

టి మీడియా,సెప్టెంబర్23, హైదరాబాద్ బ్యూరో: ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. నాలుగు ప్రధాన డిమాండ్లలో ఒక్క అంశంపైనా సీఎస్ స్పష్టత ఇవ్వలేదని ఉద్యోగుల జేఏసీ తెలిపింది. దీంతో తమ డిమాండ్లు పరిష్కారమయ్యే (మిగతా 2లో)

# మెడికల్ వీసాతో వస్తారు



▶▶| మారు పేరుతో దందాలు చేస్తారు

టీ మీడియా, సెప్టెంబర్ 23, ఢిల్లీ బ్యూరో : కాలు విరిగిందనో, కాలిన గాయాలకు చికిత్స నెపంతోనో, కాలేయం చికిత్స పేరుతోనో ఇలా అనేక కారణాలు చూపి అనేకమంది విదేశీయులు మెడికల్? వీసాలు పొందుతూ భారత్?లోకి చొరబడుతున్నారు. తర్వాత మాదక ద్రవ్యాల సరఫరా సహా అనేక నేరపూరిత కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అనేక అక్రమ దందాలు నడుపుతున్నారు. డ్రగ్స్? కేసుల్లో పట్టుబడుతున్న అధిక శాతం మంది మెడికల్? వీసాలపై బారత్?కు వచ్చిన వారిగా గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే,

పలు రాష్ట్రాల్లో వ్యభిచారం, డ్రగ్స్ దందా ఘనా దేశానికి చెందిన ఓ మహిళ ఎనిమిది సంవత్సరాల కిందట మెడికల్ వీసాతో భారత్?కు వ్చచింది. దీనిలో భాగంగా హైదరాబాద్?కు వచ్చి (మిగతా 2లో)

# రిమ్స్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



▶▶| బాధిత కుటుంబాలకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం

టి మీడియా, సెప్టెంబర్ 23, హైదరాబాద్ బ్యూరో: **ఆదిలాబాద్** రిమ్స్‌లో నెలకొన్న భయానక పరిస్థితి కొనసాగుతోంది. స్పెషల్ న్యూ నియోనేటల్ కేర్ యూనిట్‌లోని ఏసీలో మంటలు ఎగిసి పేలి అందులో చనిపోయిన వారి సంఖ్య ఐదుకిచేరింది. అక్కడ చికిత్స పొందుతున్న 27మంది పసికందుల్లో (మిగతా 2లో)

# మెడికల్ వీసాతో వస్తారు

(మొదటి పేజీ తరువాయి)
ఓ ప్రైవేట్? ఆస్పత్రిలో ఒక్క రోజు చికిత్స తీసుకొంది. ఆ తర్వాత మారు పేరుతో దేశంలోని పలు రాష్ట్రాల్లో తిరుగుతూ వ్యభిచారం, డ్రగ్స్ దందా నడుపుతోంది. ఈ నేపథ్యంలోనే సింథటిక్? డ్రగ్స్? చేరవేసే ఏజెంట్? ఒకరు పోలీసులకు పట్టుబడటంతో అతడి వద్ద ఈమె ఫోన్? నంబరు లభించింది. దీని ఆధారంగా హెచ్?న్యూ పోలీసులు ఇటీవల టోలీచౌకిలో ఆమె ఆచూకీని గుర్తించారు. ఆపై ఆమెను స్వదేశానికి తరలించారు.

**దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ విస్తరణ**

ఇదే తరహాలో పది సంవత్సరాల క్రితం ఓ వ్యక్తి కిడ్నీ వైద్యం కోసం నైజీరియా నుంచి భారత్?కు వచ్చాడు. అతడు రెండు రోజులు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. ఆపై మకాం మార్చాడు. బెంగళూరులో ఉంటూ మారు పేరుతో చలామణిలో కొనసాగాడు. దేశంలో అనేక చోట్ల నైజీరియన్? స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని దేశవ్యాప్తంగా నెట్?వర్క్?ను విస్తరించాడు. అతడిని గత సంవత్సరం అతికష్టం మీద అదుపులోకి తీసుకున్న పోలీసులు డిపోర్టేషన్ చేశారు.

**కనీసం ఆస్పత్రులకు చేరకుండానే మాయం**

ఈ తరహాలోనే అనేక మంది విదేశీయులు మెడికల్? వీసాలపై భారత్?కు వస్తున్నారు. వారిలో కొందరు కనీసం ఆస్పత్రులకు చేరకుండానే మాయమవుతున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు దళారుల ఆదేశాలతో ఇక్కడకు వచ్చి నకిలీ ఆధార్? కార్డులు సంపాదిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇలా దీర్ఘ స్వల్పకాలిక వీసాలు సంపాదిస్తున్నారు. ఈ తరహాలోనే పాకిస్థాన్? పౌరుల్లో సుమారు 10 మంది వీసా, పాస్?పోర్టు గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరికి సంబంధించిన వివరాలను ఇటీవల పోలీసు ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం.

**ఆసుపత్రులదీ అదే దారి**

హైదరాబాద్?లోని పలు ఆస్పత్రులు బీమా సొమ్ముపై ఆశతో తప్పటడుగులు వేస్తున్నాయని అనేక ఆరోపణలు ఉన్నాయి. చదువుల కోసం ఇక్కడకు వచ్చిన విదేశీ విద్యార్థులకు పెద్ద ఎత్తున కమీషన్ల ఆశ చూపుతున్నారు. ఆయా దేశాల్లో వైద్య సేవలు అవసరమైన వారితో మంతనాలు సాగిస్తున్నారు. ఆపై వారని మెడికల్ వీసాతో ఇక్కడకు రప్పించేలా చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే అదనుగా చేసుకొని డ్రగ్స్? స్మగ్లింగ్? గ్యాంగులు వీరికి గాలం వేస్తున్నాయి. భారత్‌లో మత్తుపదార్థాలు సరఫరా చేసేందుకు, ఏజెంట్లుగా పనిచేసేందుకు మెడికల్ వీసాను అనువుగా మలుచుకుంటున్నారని ఓ పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు.

**వేరే నగరాలకు మకాం మారుస్తూ దందా**

సాధారణంగా మెడికల్? వీసాపై వచ్చిన వారు చికిత్స అనంతరం వారి దేశానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే వీరిలో అత్యధిక శాతం నిర్దేశిత గడువు తర్వాత వేరే నగరాలకు మకాం మార్చుతున్నట్లు తెలుస్తోంది. వారికి సంబంధించిన చిరునామా, ఫోన్? నంబరు మార్చి పోలీసులు, ఆసుపత్రి వర్గాలకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. భారత్?లోని పుణె, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్‌లో పట్టుబడే సింథటిక్ డ్రగ్స్ కేసుల్లో ప్రధాన సూత్రధారులు నైజీరియన్లే ఉంటున్నారని ఆ అధికారి వెల్లడించారు.

# రిమ్స్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)
ఇప్పటికే ముగ్గురు మృత్యువాత పడగా మరో ఇద్దరు చనిపోయారు. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మల్లెగూడ దుర్గాబాయి కూతురు,ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన నాగుబాయి కూతురు మృత్యువాత పడింది. క్షేమంగా ఉన్న నలుగురిని తల్లితండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. మిగిలిన వారికి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

**రూ.5 లక్షల చొప్పున పరిహారం**

ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించిన వైద్యారోగ్యా శాఖ మంత్రి రాజనర్సింహ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. రిమ్స్‌లో 150 బెడ్లతో మాతాశిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించిన మంత్రి దామోదర రాజనర్సిహ అత్యాధునిక వసతులతో ఎంసీహెచ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు.

**ఐదుకు చేరిన మృతుల సంఖ్య**

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిని అధికార, విపక్ష నేతలు సందర్శించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ సహా సంజీవ్‌రెడ్డి బృందం ఎస్పీ అఖిల్ మహాజన్ వేర్వేరుగా రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి అక్కడి పరిస్థితని ఆరాతీశారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్నల నేతృత్వంలో ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవా లక్ష్మితో కూడిన బృందం రిమ్స్‌కి వెళ్లి ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలసుకుంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల కుటుంబాలను ఓదార్చింది. పిల్లల మృతి ప్రభుత్వ హత్యలని, సత్యవతి రాథోడ్ ధ్వజమెత్తారు. రిమ్స్ ప్రమాద బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ తరపున లక్ష చొప్పున సాయం అందించనున్నట్లు వివరించారు. రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దత్తత తీసుకున్న ఉమ్మడి జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ వైద్యం ఎలా అందుతుందో రిమ్స్ ఘటన కళ్లకు కట్టిందని విమర్శించారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు టీఆర్ఎస్ తరపున 50 వేల పరిహారం అందిస్తామని తెలిపారు. మొత్తం అంతా రూ.6.50 లక్షల ఆర్థిక సాయం అందనుంది.

**హెచ్ఆర్సీ ఆదేశం**

రిమ్స్‌లో చిన్నారుల మృతిపై మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. మొత్తం ఘటనపై ఈనెల 27లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని హెచ్?ఆర్సీ ఆదేశించింది.

# నిద్రపోతున్న నిఘా నేత్రాలు

● **రెచ్చిపోతున్న ఆకతాయిలు, నేరముఠాలు**

**టి మీడియా, సెప్టెంబర్ 23, హైదరాబాద్ బ్యూరో :**
ఇంటర్?నెట్ విస్తృతం కావడంతో అశ్లీల వీడియోల ప్రభావం, మాదక ద్రవ్యాల(గంజాయి) మత్తులో విచక్షణ కోల్పోతున్న వ్యసనపరులు నట్టింట్లోకి చొరబడుతున్నారు. ప్రేమ పేరిట వెంటపడి వేధించడం, కాదంటే కిడ్నాప్?నకు తెగించేందుకు వెనుకాడటం లేదు. సిబ్బంది కొరత, అరకొర గస్తీతో శివారు ప్రాంతాలపై పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్? నగరంలో పలుచోట్ల సీసీ కెమెరాలు మూలకు చేరుతుండటంతో ఆందోళన కలిగిస్తోంది.

**నిర్వహణ లేక భద్రత గాలికి**

భాగ్యనగరంలో సుమారు 60–65% వరకు సీసీ కెమెరాలు నిర్వహణ సరిగా లేకపోవడంతో మొరాయిస్తున్నాయి. కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు నిధుల్లేక దాతలు ముందుకు రాక భద్రత గాలిలో దీపంలా మారింది. గత ఏడాది మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో 2,292 పోక్సో, 944 రేప్, 865 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 10–20% కేసులు పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

**ప్రేమ, పెళ్లి పేరుతో వేధింపులు**

హైదరాబాద్? నగరంలో అధికశాతం ప్రైవేటు హాస్టళ్ల వద్ద అమ్మాయిల వెంటపడే పోకిరీలు, ప్రేమ, పెళ్లి పేరుతో వేధింపులకు పాల్పడే ప్రబుద్ధులు దర్శనమిస్తున్నారు. ఇటీవల కేపీహెచ్‌బీ(కూకట్?పల్లి హౌసింగ్ బోర్డు) పరిధిలో ఓ హాస్టల్? వద్ద ఆకతాయి చేష్టలు, ఘర్షణకు దిగిన కొంతమందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఆర్ నగర్, మాదాపూర్, అమీర్‌పేట,



గచ్చిబౌలి, కూకట్‌పల్లి, శంషాబాద్, దిల్‌సుఖ్‌నగర్‌లలో పీజీ హాస్టళ్లలో పోలీసులు తనిఖీలు చేపడుతున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది.

**మచ్చుకు కొన్ని ఘటనలు**

ఇంటికి చేదోడువాదోడుగా నిలవాలనే లక్ష్యంతో కష్టపడి చదువుకొని, శంషాబాద్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతిపై బిహార్ రాష్ట్రానికి చెందిన బైక్ మెకానిక్ సనా ఉల్లా హత్యాచారానికి పాల్పడ్డాడు.

పటాన్‌చెరు ఠాణా పరిధి పోచారం సమీపంలో ఓ నిరుపేద కుటుంబంపై మహ్మద్‌పాషా, రాజు, రాజేశ్ అనే వ్యక్తులు దాడి చేసి బాలికను ఎత్తుకెళ్లారు. నిందితుల్లో ఒకడైన పాషా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు.

నగరంలోని ఓ ప్రధాన ప్రాంతంలోని రోడ్డు పక్కన అర్ధరాత్రి దాటాక యువతీ, యువకుడు మాట్లాడుకుంటుండగా ఓ యువకుడు వారి వద్దకు వచ్చి ఆ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించి పారిపోయినట్టు సమాచారం. నోరు మెదిపే ధైర్యం చేయలేని ఎంతోమంది యువతులు ఇలాంటి వేధింపులను మౌనంగా భరిస్తున్నారు.



**డయల్ 112కు ఫిర్యాదు చేయండి**

పీజీ(పేయింగ్ గెస్ట్?) హాస్టళ్లు, కంపెనీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో గస్తీ పెంచాలని హైదరాబాద్? సీపీ సజ్జనర్ ఆదేశించినట్టు శంషాబాద్ డీసీపీ రాజేశ్ వివరించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో పాటు డార్క్‌స్పాట్లను గుర్తిస్తున్నామని తెలిపారు. కొత్త వ్యక్తులను పనిలో పెట్టుకునే ముందు పోలీసుల నుంచి ఎన్‌వోసీ(నిరభ్యంతర పత్రం) తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. వేధింపులపై మహిళలు, యువతులు డయల్ 112 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై చిన్నారులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎల్బీనగర్ డీసీపీ అనురాధ తెలిపారు.

# పర్యాటక ప్రాంతాలు మూసివేత

**⏭ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ**

**టీ.మీడియా,సెప్టెంబర్23.చింతూరు:**
తుఫాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయని, కొండ చరియలు విరిగిపడవచ్చునని అందువల్ల

చింతూరు పోలీస్ సర్కిల్లోని మోతుగూడెం, పోల్లూరు, ఫోర్ బే క్యాంపు, వాటర్ ఫాల్స్, డొంకరాయి తదితర పర్యాటక ప్రాంతా లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రజలు ఇళ్లల్లోనే నివసించాలని వర్షాలకు బయటకు రాకూడదని, ప్రమాదకరమైన వాగులు వంకలు దాటకూడదని పేర్కొన్నారు. ఈ తుఫాను తగ్గే వరకు చింతూరు పోలీస్ సర్కిల్లో ని పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఎవరు రాకూడదని తెలిపారు.



# జూరాల కాల్వలకు సాగునీరు విడుదల

(మొదటి పేజీ తరువాయి)
సానుకూల నిర్ణయం వెలువడింది. పాలమూరు రైతుల కోసం నీటి విడుదలకు అంగీకరించిన డీకే శివకుమార్‌కు తెలంగాణ ప్రజల తరఫున రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహభావానికి ఇది చక్కటి నిదర్శనమని పేర్కొన్నారు.

**సాగునీరు విడుదల**

కర్ణాటక సానుకూల నిర్ణయంతో జూరాల జలాశయం కాలువలకు అధికారులు తిరిగి సాగునీటిని విడుదల చేశారు. ఈ నెల 14న జూరాల ఆయకట్టు కింద ఉన్న కుడి, ఎడమ కాలువలకు అధికారులు సాగునీటిని నిలిపేశారు. దీంతో సాగునీటిని వెంటనే విడుదల చేయాలంటూ రైతులు.. గత వారం నుంచి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. అన్నదాతలకు మద్దతుగా ప్రతిపక్ష బీఆర్ఎస్?, బీజేపీ కూడా ఆందోళనలు చేపట్టాయి. ఈ పరిణామాల మధ్య కర్ణాటక సర్కార్‌తో చర్చలు ఫలించి నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ఇదే సమయంలో జూరాలకు స్వల్పంగా వరద పెరిగిందని అధికారులు తెలిపారు. సాగునీటి విడుదలను పునరుద్ధరించినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, అరెస్ట్ చేయండి

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని తెలిపారు. ఈ వ్యవహారంపై చర్చించేందుకు 'ఇండీ' కూటమి త్వరలోనే సమావేశమవుతుందని వెల్లడించారు.

అటు డి ఎం కె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ సైతం ఈ విషయంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జజుజ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. ూ×= ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలో జరిగిన పరిణామాలపై నిష్పాక్షిక విచారణ జరగాలని, బాధ్యులైన వారిని జవాబుదారీగా చేయాలని కోరారు. ూ×= ప్రక్రియ తర్వాత జరిగిన ప్రతి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్రమైన అనుమానాలు కలిగించేలా, "సాక్ష్యాధారాలతో" కూడిన వివరాలను ఒక ఆంగ్ల దినపత్రిక ప్రచురించిందని స్టాలిన్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ూ×= పేరుతో ఓటర్ల జాబితా నుంచి కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించే చర్యను తమ పార్టీ మొదటి నుంచీ నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉందని చెప్పారు.

# సీఎస్‌తో ఉద్యోగుల ఐకాస చర్చలు విఫలం

(మొదటి పేజీ తరువాయి)
వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది. రేపు జరిగే విస్తృతస్థాయి సమావేశంలో తదుపరి కార్యచరణ ఖరారు చేస్తామని జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు.

**స్పష్టత ఇవ్వలేదు**

ప్రభుత్వ సూచన మేరకు రెండు రోజులుగా వాయిదా పడిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సచివాలయంలో జరిగింది. ఐదు డీఏల్లో కనీసం మూడు ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేయగా రెండు డీఏలు ఇవ్వాలని కేబినెట్‌కు సిఫార్సు చేస్తామని సీఎస్ సంజయ్ జాజు చెప్పినట్లు తెలిపారు. దసరా నాటికి ఒకటి, ఉగాది వరకు మరో డీఏ ఇచ్చేలా ప్రతిపాదిస్తామని సీఎస్ చెప్పారన్న ఉద్యోగ సంఘం నేతలు నాలుగు ప్రధాన డిమాండ్లలో ఒక్కదానిపైనా సీఎస్ స్పష్టత ఇవ్వలేదని చెప్పారు.

**ప్రభుత్వంతో ఉద్యోగుల ఐకాస చర్చలు విఫలం ఉద్యమం కొనసాగుతుంది**

పెండింగు బిల్లుల కోసం నెలకు రూ.2వేల కోట్లు ఇవ్వాలని తాము కోరగా ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.వెయ్యి కోట్లు మాత్రమే చెల్లించగలమని సీఎస్ చెప్పారని ఉద్యోగుల జేఏసీ పేర్కొంది. పీఆర్సీ నివేదిక ఒకట్రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాత రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎస్ దాటవేసే ప్రయత్నం చేశారని జేఏసీ అసంతృప్తి వ్యక్తంచేసింది. సీపీఎస్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఎప్పట్లోగా వేస్తారు, నివేదిక సమర్పణకు ఎంత కాలం గడువు ఇస్తారో స్పష్టం చేయలేదని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. చర్చలు విఫలమైనందున డిమాండ్ల సాధన కోసం ఉద్యమం కొనసాగుతుందని ఉద్యోగుల జేఏసీ నేతలు ప్రకటించారు.

"ఈరోజు రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు సంతృప్తికరంగా లేవు. ముఖ్యంగా మూడు డీఏలు, నెల రోజుల్లో పీఆర్సీ ప్రక్రియను ప్రారంభిస్తారని మేము భావించాం. అదేవిధంగా పెండింగ్ బాకయిలు, కొత్త పెన్షన్ విధానం పట్ల ప్రభుత్వం క్రియాశీలకంగా ముందడుగు వేస్తుందని ఆశించాం. కానీ కేవలం ఇంక్రిమెంట్?పైన మాత్రమే సానుకూలంగా స్పందించారు" – మధుసూదన్ రెడ్డి, ఉద్యోగుల జేఏసీ కో కన్వీనర్

గురువారం టీజీఈజేఏసీ రాష్ట్రస్థాయి అత్యవసర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి తదుపరి కార్యచరణ ఖరారు చేస్తామని ఉద్యోగ జేఏసీ నేతలు తెలిపారు.

# 'ఇంటి ముంగిటకే మీ సేవ సర్వీసులు'

(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంటి ముంగిటకే మీ సేవ సర్వీసులు పేరిట మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్‌కు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండలంలో మంత్రి దీనికి సంబంధించిన పోర్టర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా లేదా మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్‌ను బుక్ చేసుకున్నట్లయితే మీ సేవ ఎగ్జిక్యూటివ్ ఇంటి వద్దకే వస్తారని పేర్కొన్నారు.

**రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాం**

ఇంటి వద్దనే జనన లేదా మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు ఇలా మీ సేవ ద్వారా అందించే అన్ని ముఖ్యమైన పౌర సేవల డెలివరీ చేస్తారని మంత్రి వివరించారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో క్యూర్ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని మంత్రి వివరించారు.

# ఆయుర్వేదం.. ఆరోగ్యానికి అండ




**⏭ ఆయుర్వేద వైద్యురాలు జి.తన్మయి**

**టీమీడియా,సెప్టెంబర్23,సింగరేణి(కారేపల్లి):**
ఆయుర్వేదంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని,నిత్యం యోగా చేయడం వల్ల శారీరక,మానసిక ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు జి. తన్మయి అన్నారు.11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఆయుర్వేదం,యోగాపై అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ తన్మయి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.ఆయుర్వేద వైద్య విధానాలు, ఔషధాల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.బాలికల్లో సాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి.సావిత్రి,ఫార్మసిస్ట్ స్వాతి,ప్రభాకర్,నర్సింగ్ ఆఫీసర్ జె.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమికి ముందే ఆలయ పనులు పూర్తి



- ⏭ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ⏭ ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పని

**టి మీడియా, సెప్టెంబర్ 23, భద్రాచలం :**
శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

బుధవారం భద్రాచలం చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.తదుపరి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి, వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు, రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి, వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో పూర్తి చేసేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.లిఫ్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు.

ఆలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు.ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలకు బూట్లు పంపిణీ



**టీ మీడియా, సెప్టెంబర్ 23 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో గల ప్రాథమిక పాఠశాల కిష్టారెడ్డిపేటలో విద్యార్థిని విద్యార్థులకు బూట్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎం ఈ వో జయరాములు ఎ ఎ పి ఎస్ చైర్ పర్సన్ బాలీశ్వరమ్మ కిష్టారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలారి చెన్నకేశవులు ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ కౌన్సిలర్ తాటికొండ కృష్ణ జెడ్ పి హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి నరసింహగౌడ్ ఎం పి పి ఎస్ చెలిమిల్ల ఎల్ ఎఫ్ ఎల్ హెడ్ మాస్టర్ నారాయణ సామాజిక సేవా కార్యకర్త ఎద్దుల గోవర్ధన్ రెడ్డి చెలిమిల్ల మాజీ ఉప సర్పంచ్ బొల్లెద్దుల రాముడు సి ఆర్ పి రామేశ్వరమ్మ వెంకటయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు ఒకరు మృతి

- ⏭ ఇద్దరికి గాయాలు



**టీ మీడియా,సెప్టెంబర్ 23, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పాత సూగూరు గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో పిడుగు పడింది ఈ సంఘటనలో పొలం పనులకు వెళ్లిన ముగ్గురు మహిళలు పిడుగు పాటుకు గురైయ్యారు స్థానికులు 108 కు సమాచారం అందించి క్షతగాత్రులను హాస్పటల్ కు తరలించగా అందులో కుమ్మరి లక్ష్మి (36)అనే మహిళ మరణించింది సువర్ణ(36) అనురాధ (40) లు చికిత్స పొందుతున్నారు
గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్ సీనియర్ నేత గురవయ్య కన్నుమూత



- ⏭ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ
- ⏭ పార్టీ జెండా కప్పి నేతల నివాళి

**టీ మీడియా,సెప్టెంబర్23,సింగరేణి(కారేపల్లి):**
పేరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిక్కుల గురవయ్య బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు.ఆయన మృతి పట్ల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.గురవయ్య మృతదేహాన్ని సర్పంచ్ బానోతు పద్మావతి,కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు,గణపారపు లక్ష్మీనారాయణ,బానోత్ వీరభద్రం సందర్శించారు.మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.పార్టీకి గురవయ్య అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల వీరన్న,కేలోతు శ్రీను,నల్లమోతు కోటేశ్వరరావు,సజ్జ నాగేశ్వరరావు,కేలోతు బాలు,మంగు భాను,బండారి నాగేశ్వరరావు,మధ్యాహ్నపు సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ఏజెన్సీ ఆసుపత్రిలో కరువైన రక్షణ




- ⏭ భయంలో మహిళా డ్యూటీ డాక్టర్లు

**టీ మీడియా ,సెప్టెంబర్ 23, ఆళ్లపల్లి :**
నిరంతరం రోగుల సేవలో గడిపే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ( వైద్యులకు, సిబ్బందికి కనీస భద్రత కరువైంది. ఏజెన్సీ మండలమైన ఆళ్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్లు తీవ్ర భయాందోళనల నడుమ రాత్రివేళల్లో విధులు నిర్వహిస్తున్నారు. రక్షణ కల్పించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వైద్య సేవలు అందించాల్సి వస్తోందని లేడీ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏజెన్సీ ప్రాంతంలో భయం భయం!**

?ఆళ్లపల్లి మండలం దట్టమైన అటవీప్రాంతంతో కూడుకున్న ఏజెన్సీ ప్రాంతం కావడం వల్ల రాత్రివేళల్లో శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారింది. ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. అయితే, రాత్రివేళల్లో అత్యవసర సేవల కోసం వచ్చే కొందరు వ్యక్తులు తీవ్రంగా మద్యం మత్తులో ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నారు. డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్లు, నర్సులతో అసభ్యంగా ప్రవర్తించడం, ప్రశ్నిస్తే గొడవకు దిగడం, బెదిరింపులకు పాల్పడటం ఇక్కడ పరిపాటిగా మారింది. సెక్యూరిటీ గార్డులు ఎవరూ లేకపోవడంతో ఆకతాయిలను అడ్డుకునే నాథుడే లేకుండా పోయాడు.

**భద్రత కరువు**

ఆసుపత్రి ఆవరణలో సరైన భద్రతా వ్యవస్థ, సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం వల్ల ఘోరాలు అని ఆరోపిస్తున్నారు. పెద్ద దారుణం జరిగినా అధికారులలో గానీ, ప్రజాప్రతినిధులలో గానీ ఎలాంటి చలనం రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో ప్రాణం పోయే వరకు అధికారులు వేచి చూస్తారా? అని స్థానికులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధైర్యంగా డ్యూటీ చేసే వాతావరణం కల్పించండి! "మేము ఏజెన్సీ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేకపోతే మాకు ఏదైనా దారుణం జరిగితే బాధ్యులు ఎవరు? పిహెచ్‌సిలో వెంటనే 24 గంటల సెక్యూరిటీ గార్డులను నియమించాలని, సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసి ఆసుపత్రి ఆవరణలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు మరియు జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# జూరాల ప్రాజెక్టు కాలువలకు తెరిచిన నీళ్లు ఎక్కడివి



**టీ మీడియా ,సెప్టెంబర్ 23, ఆత్మకూరు :**
వనపర్తి జిల్లా అమరచింత మండలంలో గల జూరాల ప్రాజెక్టు కుడి ఎడమల కాల్వకు నీళ్లు అధికారులు విడిచారు. గత వారం పది రోజుల నుండి కాల్వ ద్వారా నీళ్లు విడిచాలని టిఆర్ఎస్ బిజెపి ,కమ్యూనిస్టు పార్టీలు రైతుల కొరకు నీటి విడుదల కొరకు ఉద్యమాలు చేశారు. నీటి విడుదల విషయంలో కాంగ్రెస్ నాయకులకు సరైన పరిజ్ఞానం లేదని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈ నీటి విడుదల ఉద్యమంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నీ , ఆత్మకూర్ అమరచింత మండల నాయకులని ముందస్తు అరెస్టు చేశారు.

సాగునీటి విషయంలో భారతీయ జనతా పార్టీ మండల జిల్లా నాయకులు కూడా జూరాల డాం పై రాస్తారోకోలు చేసి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిజెపి జిల్లా మండల నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. జూరాల ప్రాజెక్టు కాలువలకు నీళ్లు విడిచాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు పర్యటన ఏర్పాటు చేశారు . ఆయనను మధ్యలోనే అరెస్టు చేశారు.

ఇదే విషయంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు కూడా ఉదయం నుండి సాయంత్రం వరకు జూరాల ప్రాజెక్టుపై రాస్తారోకో చేసి, మండల, జిల్లా నాయకులని అరెస్టు చేశారు. రైతులు తమ కడుపు కాళీ స్వచ్ఛందంగా ఏ పార్టీ సపోర్ట్ లేకుండా చేస్తున్న రైతులను కూడా తరిమికొట్టారు పోలీసులు, స్పెషల్ బలగాలు. తెలంగాణ కాంగ్రెస్ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు కలిసి కర్ణాటక కు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి కలిసి జూరాల ప్రాజెక్టు నీళ్లు విడవాలి అని కోరారు. కర్ణాటక ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఆల్మట్టి నుండి రోజు కొద్ది కొద్దిగా 15 టీఎంసీ నీరు విడిస్తాము అని హామీ ఇచ్చారు. కర్ణాటక నీళ్లు విడిస్తే జూరాల ప్రాజెక్టు రావడానికి దాదాపు ఒకటిన్నర రెండు రోజులు అవుతుంది. ప్రస్తుతం మన జూరాల ప్రాజెక్టులోని నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో ఉన్న నీరు సాగునీటికి, త్రాగునీటికి
వచ్చే జూన్ వరకు ఉన్నాయని అనుభవజ్ఞ ఆయన రాజకీయ నాయకులు చెప్పిన వారి మాటలు వారి మాట వినకుండా వారం రోజులపాటు రైతులను అధికారులను రాజకీయ నాయకులను మీడియా వాళ్లను పరేషాన్ చేసి తమ కాంగ్రెస్ పార్టీ మాటే నెగ్గాలని నాయకులు చేసిన దౌత్యం ద్వారా నీరు వచ్చాయని నమ్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

# గంగమ్మ ఒడిలోకి బయలుదేరిన గణనాథులు



- ⏭ గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి

**టీ మీడియా, సెప్టెంబర్ 23, రామకృష్ణాపూర్;**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలో బుధవారం వినాయక నిమజ్జన శోభాయాత్ర ఘనంగా జరిగింది. పట్టణంలోని మండపాల గణనాథులను అలంకరించిన వాహనాలపై రాజీవ్ చౌక్ కు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, కొబ్బరికాయలు కొట్టి గోదావరి నదికి సాగనంపారు.గణపతి బప్పా మోరియా నినాదాలతో పట్టణం మార్మోగింది. శోభాయాత్రలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి,కమిషనర్ మురళీకృష్ణ,పాల్గొని పూజలు చేశారు. మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ పరస రమేష్, ఎస్ఐ జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం






### ⏭ గోదావరి జలాలు విడుదల చేసిన మంత్రులు తుమ్మల ,పొంగులేటి

**టి మీడియా, సెప్టెంబర్ 23, అశ్వాపురం (భద్రాద్రి కొత్తగూడెం):**
రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు.మరెళ్లపాడు పథకం పంపులను ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేసిన మంత్రులు అనంతరం పథకాన్ని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,**
తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న అశ్వాపురం ప్రాంత రైతుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారద్యం లో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక ప్రాంతం నుంచి గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలు తదితర సమస్యలను అధిగమిస్తూ ముందుకు తీసుకెళు న్నామని చెప్పారు.
సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై సర్వేలు నిర్వహించి సవరించిన అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు సహకరించాలని, భూములు కోల్పోయే వారికి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు వంటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. పులుసుబొంత్ ప్రాంతంలో అటవీ అనుమతులు, ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సాధ్యమైన ప్రాంతాల్లో చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి గోదావరి జలాలను నిల్వ చేయాలని సూచించారు.
ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో తక్కువ నీటి అవసరం ఉన్న, తక్కువ కాలంలో పూర్తయ్యే పంటలను సాగు చేయాలని కోరారు. అశ్వారావుపేట, పినపాక ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని, అవసరమైన మేరకు మొక్కలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల ఆర్థికాభివృద్ధి, సాగునీటి వనరుల విస్తరణ, వ్యవసాయ రంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.350 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. పుష్కరాల నాటికి సాధ్యమైనంత మేరకు పనులు పూర్తి చేసి భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ**
, ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, నిరుద్యోగులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత 30 నెలల్లో సుమారు 72 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.
మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పనులు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. పులుసుబొంత్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరలో టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూర్గంపాడు ప్రాంతంలోని దొమ్మలవాగు రిజర్వాయర్, ఇతర చిన్న నీటిపారుదల పథకాలపై ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
ఇందిరమ్మ ఇళ్ల తదుపరి దశల్లో అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తరించడంతో రోజుకు సుమారు 450 నుంచి 500 మంది వరకు సేవలు పొందుతున్నారని తెలిపారు.

**పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ**
రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా అశ్వాపురం మండలంలోని సుమారు 24 గ్రామాలతో పాటు ఇతర మండలాలకు కూడా సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థుల హాస్టళ్లలో కాస్మోటిక్, మెస్ ఛార్జీలు, సన్న బియ్యం వంటి సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, సామాజిక భద్రత పింఛన్లు వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు.

**శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ**
మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభంతో అశ్వాపురం, పినపాక ప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరుకోవడం రైతులకు పండుగ వాతావరణాన్ని కల్పించిందన్నారు. 2005 డిసెంబర్ 31న దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు పునాది వేసినప్పటి నుంచి జరిగిన పరిణామాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేసి సీతారామ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 ఆగస్టు 15న సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు.
అశ్వాపురం మండలంలో కుడి కాలువ పనులకు సుమారు రూ.130 కోట్లతో పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చింతకుంట, జగ్గారం పరిధిలోని ఎర్రబోకల చెరువు, మిట్టగూడెం పరిధిలోని లోయర్ చెరువుతో పాటు అనుసంధాన చెరువులకు నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కుడి కాలువ ద్వారా తొమ్మిది గ్రామపంచాయతీలకు నీరు అందించి సుమారు 11,981 ఎకరాల కమాండ్ ఏరియాను స్థిరీకరించే అవకాశం ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 24 గ్రామపంచాయతీల పరిధిలోని 68 గ్రామాలకు, సుమారు 13,037 కుటుంబాలకు, దాదాపు 24 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. తుమ్మల చెరువు ప్రధాన కాలువను బలోపేతం చేసి కాంక్రీట్ లైనింగ్‌తో పాటు సుమారు 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. గొందిగూడెం, వెంకటాపురం వంటి గిరిజన గ్రామాలకు కూడా సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.
మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం నుంచి మణుగూరు ప్రాంతంలోని రెగులగండి చెరువుకు నీరు అందిస్తే సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరు అందించి మూడు పంటలు పండించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. బూర్గంపాడు ప్రాంతంలోని దొమ్మలవాగు రిజర్వాయర్‌ను మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. మారేళ్లపాడు పథకాన్ని పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

**జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ**
మారేళ్లపాడు ఎత్తిపోతల పథకంతో పాటు జిల్లాలో సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పులుసుబొంత్ ప్రాజెక్టుకు అవసరమైన కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండతో పాటు మొత్తం ఎనిమిది మండలాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీల సర్వే సుమారు 60 శాతం పూర్తయిందని తెలిపారు.
సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 600 ఎకరాల భూసేకరణ పూర్తయి అవార్డు దశలో ఉందని కలెక్టర్ తెలిపారు. భూసేకరణకు ప్రభుత్వం సుమారు రూ.46 కోట్ల నిధులు విడుదల చేసి పంపిణీ చేసినట్లు చెప్పారు. యటాలకుంట, నాగుపల్లి, దమ్మపేట తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను వచ్చే రెండు మూడు నెలల్లో పరిశీలించి వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, సర్వేలు, అనుమతులు, డిస్ట్రిబ్యూటరీ పనులను సమన్వయంతో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పి రోహిత్ రాజు,జిల్లా అటవీ అధికారి సిధార్ద్ విక్రమ్ సింగ్ , భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ , నీటిపారుదల శాఖ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# హైవే రోడ్డు మలుపులను



### ⏭ సరి చేయాలని వినతి గ్రామ సర్పంచ్

**టీ మీడియా,సెప్టెంబర్ 23 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్ హెచ్ 44 హైవే రోడ్డు మలుపుల దగ్గర సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల నిరంతరం వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి ఈ విషయంలో కాంట్రాక్టర్ వెంటనే మలుపుల దగ్గర ఉన్న గుంతలను పూడ్చి రోడ్లను సరిచేసి వాహనాలకు సరైన దిశా నిర్దేశం చేసే బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గుడిసె అశోక్ కుమార్ కాంట్రాక్టర్ పట్టణ పోలీస్ శాఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది పెబ్బేరు పట్టణ ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్ రోడ్లను పరిశీలించి రోడ్డు మలుపు ద్వారా ఇప్పటికే పలు వాహనాలు ప్రమాదాల బారిన పడ్డాయని వెంటనే సరి చేయాలని కాంట్రాక్టర్ తో మాట్లాడి ప్రమాదాలు జరగకుండా చూడాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

## నేడు జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవు

### ⏭ ఇంచార్జి కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

**టీ.మీడియా.సెప్టెంబర్23.చింతూరు:**
తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో రేపు (సెప్టెంబర్ 24) జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఏ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం కూడా రేపు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని ఆయన సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం నుంచి వెలువడే సూచనలు, ఆదేశాలను ప్రజలు పాటించాలని కోరారు.

# శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు

### ⏭ ఉద్ధృతంగా బహుదా నది

**టీ మీడియా, సెప్టెంబర్ 23, శ్రీకాకుళం:**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం – కవిటి మధ్య ఈ తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉండటంతో జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు – నీట మునిగిన గ్రామాలు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జిల్లాలోని బహుదా నదితో పాటు వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. బహుదా నది పరివాహక గ్రామాల్లోకి వరద నీరు చేరుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. డొంకూరు తీర ప్రాంతంలో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండటంతో మత్స్యకారులు భయాందోళనలో ఉన్నారు. ప్రస్తుతం ఈనేసుపేట వద్ద పద్మపురం గెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామంలోకి ఇప్పటికే వరద నీరు చేరింది. రాత్రికి ప్రవాహం మరింత పెరిగి రాకపోకలు పూర్తిగా స్తంభించే అవకాశం ఉంది. ఇదిపురం, పురుషోత్తపురం తదితర గ్రామాల్లో పలు పూరిగుడిసెలు నేలకొరిగాయి. వందలాది ఎకరాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.
తీరం దాటనున్న తీవ్ర వాయుగుండం
స్తంభించిన రాకపోకలు – జలమయమైన రహదారులు: టెక్కలి మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా పెద్దరోకళ్లపల్లి మార్గంలోని గెడ్డ ఒక్కసారిగా పోటెత్తింది. దీంతో రామనగరం – సీతారాంపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాక్షి చెరువు నిండడంతో పెద్దరోకళ్లపల్లి, పాతనౌపడ పంచాయతీల పరిధిలోని వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మరోవైపు వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట వీధులను వాన నీరు ముంచెత్తింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ నీటిని బయటకు తోడుకుంటున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోకి భారీగా వాన నీరు చేరింది.
యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు – సీఎం ఆదేశాలు:
పరిస్థితి తీవ్రతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రేపు, ఎల్లుండి కూడా అప్రమత్తత కొనసాగించాలని 261 మండలాల అధికారులను సీఎం ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నిర్దేశించారు.
కలెక్టర్ కమాండ్ కంట్రోల్: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. 11 తీర ప్రాంత మండలాల్లో ప్రత్యేకాధికారులను నియమించి ప్రతిక్షణం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఆమదాలవలస తహసీల్దార్ సత్యం నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలెవరూ అనవసరంగా బయటకు రాకూడదని అధికారులు హెచ్చరించారు.
ఒరిస్సాలోనూ భారీ వర్షాలు: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడటంతో శ్రీకాకుళం జిల్లాతో పాటు ఒరిస్సాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నాగావళి నది నీటిమట్టం పెరిగి నారాయణపురం ఆనకట్ట వద్ద వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం 7,500 క్యూసెక్కుల నీరు మడ్డువలస వద్ద విడిచిపెట్టడంతో వరద నీరు దిగు ప్రాంతానికి ప్రవహిస్తోంది. మరో పదివేల క్యూసెక్కుల నీరు పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల వేలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని నారాయణపురం నాగావళి ప్రాజెక్ట్ అధికారి చెబుతున్నారు. నారాయణపురం ప్రాజెక్టు వద్ద జేసీ ఫార్మాన్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. వరద నీరు పెరుగుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వంశధార నదిలో కూడా వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

